పత్తిలో 'గులాబీ' దిగులు.. మిర్చిలో వైరస్ వర్రీ

- ఏ పంట సాగు చేయాలో దిక్కుతోచని స్థితి
- ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెడుతున్న రైతులు
- పత్తి, మిర్చి పంటలకు పెరిగిన పెట్టుబడి ఖర్చులు



మండాదిలో పత్తి పంట

వెల్దుర్తి: పత్తి, మిర్చి పంటలకు పెట్టుబడులు అధికం కావటంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెడుతున్నారు. మిర్చి, పత్తి పంటలకు ఎకరానికి లక్షల్లో పెట్టుబడులు పెట్టినప్పటికీ అవి సరిగా పండక రైతులు అప్పుల పాలవుతున్నారు. గత ఏడాది మండలంలో 34 వేల హెక్టార్ల సాగు భూమి ఉండగా అందులో 6,500 హెక్టార్లలో మిర్చి పంటను, 23 వేల హెక్టార్లలో పత్తి పంటను, 1,500 హెక్టార్లలో కంది, పొగాకు పంటను 1000 హెక్టార్లలో, 2 వేల హెక్టార్లలో నిమ్మ, బత్తాయి, డ్రాగన్ ఫ్రూట్స్, బొప్పాయి, జూట్, ఆకుకూరల పంటలను సాగు చేశారు. గత ఏడాది పత్తి పంటలో గులాబీ రంగు పురుగు సోకటంతో పత్తిపంట పూర్తిగా పండకుండా పోయింది. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టినప్పటికీ పంటలు సక్రమంగా పండకపోవటంతో రైతులు అప్పుల పాలయ్యారు.

- బోరుబావులున్న రైతులు మిర్చి పంటను సాగు చేస్తే ఆ పంటలో వైరస్ వచ్చి చెట్లన్నీ ముడుచుకొని పోయాయి. దీంతో చెట్లకు కాయలు కాయక.. కాసిన కాయలు తెల్లకాయలు కావటంతో రైతులు అప్పుల పాలవుతున్నారు. మిర్చి పంట పండించిన రైతులకు గిట్టుబాటు ధర లేకపోవటంతో అప్పులపాలై ఈ ఏడాది సాగు చేసేందుకు కూడా భయపడుతున్నారు.
- లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టలేక ఏం పంటలు వేయాలో పాలుపోక రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్కువ పెట్టుబడితో పండించే పంటల వైపు రైతులు ప్రత్యామ్నాయాన్ని చూసుకుంటున్నారు. కంది, పొగాకు, జూట్ పంటల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ పంటలు వర్షాధారంపై ఆధారపడి పండిస్తున్నారు.
- కౌలు రైతులు పెట్టుబడులతో పాటు కౌలు వెళ్లక అప్పులపాలు కావటంతో ఈ ఏడాది భూములను తీసుకొనేవారు లేరు. గతంలో తీసుకున్న పొలాలను రైతులకు తిరిగి అప్పజెబుతున్నారు.
- తక్కువ పెట్టుబడితో సాగు చేయవచ్చన్న ఉద్దేశంతో రైతులు కంది, పొగాకు తదితర పంటలను సాగుచేసేందుకు ముందుకొస్తున్నారు. గత ఏడాది పొగాకు పంటకు ఎకరాకు రూ.60 వేలు ఆదాయం రావటంతో ఈ ఏడాది కూడా రైతులు పొగాకు పంటను పండించేందుకు ఆసక్తి చూపుతున్నారు.
- రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చేలా పంటలు వేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.
- ఈ ఏడాది ఇప్పటి వరకు సరైన వర్షం పడకపోవటంతో రైతులు తమ పొలాలను సేద్యం చేసుకోలేదు. బోరుబావులున్న రైతులు వందల ఎకరాలలో పత్తి పంటను సాగు చేస్తున్నారు. గతంలో వేల ఎకరాల్లో పత్తి పండించిన రైతులు నేడు వందల ఎకరాల్లో పంటను సాగు చేస్తున్నారు.
- మండలంలో బోరు తవ్వించాలంటే 1,200 అడుగులు వేసినా నీరు పడకపోవటంతో రైతులు వాణిజ్య పంటలు వేయటానికి భయపడుతున్నారు. మొత్తం మీద ఈ ఏడాది మండలంలో కంది, పొగాకు, జూట్ పంటలను అధిక సంఖ్యలో సాగు చేసేందుకు సమాయత్తమవుతున్నారు.



ఉప్పలపాడులో పంటలు వేసేందుకు సిద్ధంగా ఉన్న భూమి

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టండి..



రైతులు ఎక్కువ పెట్టుబడి పెట్టే పంటలకు ప్రత్యామ్నాయంగా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే పంటలను సాగు చేసుకోవాలి. పంటల మార్పిడి వలన భూమిలో పంటలు ఏపుగా పెరుగుతాయన్నారు. గత ఏడాది పొగాకు పండించిన రైతులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చాయని, రైతులు వర్షాభావంపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు కాబట్టి తక్కువ వర్షపాతంతో పండే పంటలను సాగు చేయాలన్నారు.

– ఏవో వై.పుల్లారెడ్డి, వెల్దుర్తి

హెల్మెట్ తప్పక ధరించాలి

పిడుగురాళ్ల: హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని పలువురు సభ్యులు అన్నారు. పట్టణంలోని మెయిన్ బజార్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు ఆధ్వర్యంలో పిడుగురాళ్ల జూనియర్ సివిల్ జడ్జి మురళీ గంగాధర్‌రావు ఆదేశాల మేరకు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కుమారస్వామి సూచనలతో ప్రజలకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజలు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రమాదాలు సంభవించినప్పుడు మాత్రమే హెల్మెట్ ధరించటం సరికాదని, ఎప్పుడూ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ కోవూరి వెంకటేశ్వర్లు, న్యాయవాదులు తదితరులు ఉన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న న్యాయ విజ్ఞాన సదస్సు సభ్యులు

అంతర పంటలతో పలు లాభాలు

రాజుపాలెం: పత్తి పంటలో అంతరంగా గోరు చిక్కుడు, పెసర, సజ్జ, బొబ్బర్లు, చెట్టు చిక్కుడు, కంది వేయడం వల్ల ప్రధాన పంటను తెల్లదోమ, పచ్చదోమ, పేనుబంక, పిండి, నల్లి, గులాబీ రంగు పురుగుల నుంచి కాపాడుకోవచ్చని పల్నాడు జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి తెలిపారు. మండలంలోని రెడ్డిగూడెంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. అంతర పంటల వల్ల మిత్ర పురుగుల సంఖ్య పెరుగుతుందని, దీని వల్ల చీడపీడలు ఆశించవని తెలిపారు. ద్విదళ, ఏకదళ జాతి కారణంగా భూమి సారవంతం అవుతుందని చెప్పారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ విధానంలో అంతర పంటలు వేసుకోవడం వల్ల ఆర్థికంగా బలోపేతం అవుతారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎస్ఎఫ్ఎఫ్ మల్లికార్జునరావు, సైదయ్య, ప్రకృతి వ్యవసాయ రైతులు ప్రణతి, గుర్రాల మల్లికార్జునరావు, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి సాగు పంటను పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి

చినగార్లపాడులో పల్లె నిద్ర

కారెంపూడి: ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని చినగార్లపాడు గ్రామంలో మంగళవారం రాత్రి ఎస్సై కె.అమీర్ పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామ పాఠశాల ఆవరణలో గ్రామస్తులతో సమావేశమయ్యారు. చట్టబద్ధంగా ఎవరి పనులు వారు చేసుకుంటూ జీవించడంలో ఎంతో ఆనందం ఉందని అది గ్రామస్తుల మధ్య సామరస్యతకు, ప్రశాంతతకు దారితీస్తుందన్నారు. అనవసర విషయాలు ఇతరుల స్వేచ్ఛను హరించే ప్రయత్నాలు చేయవద్దని దాని వల్ల సమస్యలు వస్తాయన్నారు. గొడవల వల్ల వచ్చే అనర్థాలు, జరుగుతున్న సైబర్ నేరాలు, ప్రస్తుతం జరుగుతున్న మోసాల గురించి ఎస్సై వివరించారు. దొంగతనాలు, ఇతర నేరాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో గ్రామస్తులకు వివరించారు. ఎవరైతే కష్టంపై ఆధారపడి జీవిస్తారో అలాంటి చోట చాలా వరకు నేరాలు అదుపులో ఉంటాయన్నారు.

కట్న వేధింపులపై కేసు నమోదు

ముప్పాళ్ళ: అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నారని వివాహిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.హజరతయ్య మంగళవారం తెలిపారు. ముప్పాళ్ళ ఎస్సీ కాలనీకి చెందిన మాదుగుల కోటేశ్వరమ్మతో గుంటూరుకు చెందిన విజయసాగర్‌కు సుమారు ఏడు నెలల క్రితం వివాహం జరిగింది. భర్త , అత్తమామలు తరచూ అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తుండటంతో ఆమె పుట్టింటికి చేరారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆధార్ నమోదు కేంద్రాల ఏర్పాటు

పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

మాచర్ల: పట్టణంలోని ప్రత్యేక ఆధార్ కేంద్రాలను మూడు సచివాలయాల్లో ఏర్పాటు చేసి ముమ్మరంగా ఆధార్ అనుసంధానం, అప్‌డేట్, నూతన ఆధార్‌కార్డుల జారీ తదితర కార్యక్రమాలను చేపట్టారు. మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు పట్టణంలోని జెండా చెట్టు, రోప్‌వే, పూర్ణయ్య షెడ్ బజారులలోని సచివాలయాలలో ఆధార్ అనుసంధాన కార్యక్రమాన్ని చేపట్టారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ఆయా సచివాలయాల్లో ఆధార్ కార్డు అప్‌డేట్, నూతన ఆధార్ కార్డు నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాస్, పట్టణంలో ఏర్పాటు చేసిన ఆధార్‌కార్డు నమోదు కేంద్రాలను సందర్శించి పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

పిడుగురాళ్ల: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో ఆధార్ అప్‌డేట్ క్యాంపులను ఆయా ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ గిరికుమార్ మంగళవారం తెలిపారు. ఈ నెల 24వ తేదీన సీతారామపురం తండా స్కూల్, పీడబ్ల్యూడీ కాలనీలో కేంద్రాలు నిర్వహించటం జరుగుతుందని, 25న లెనిన్ నగర్ 17వ సచివాలయంలో, పీడబ్ల్యూడీ కాలనీలో, 26న పిల్లలగడ్డలోని 16 సచివాలయంలో, భనోదాయ స్కూల్‌లో, అదేవిధంగా 27వ తేదీన యర్రావారి వీధిలోని 15వ సచివాలయంలో, భనోదయ స్కూల్‌లో ఆధార్ అప్‌డేట్ క్యాంప్‌ను నిర్వహించనున్నారు. ఈ క్యాంప్‌లు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించటం జరుగుతుందని, ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలోని 1వ సచివాలయంలో, పీడబ్ల్యూడీ కాలనీలో మంగళవారం ఆధార్ అప్‌డేట్ క్యాంప్ నిర్వహించారు. ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకోవటానికి ఈ క్యాంప్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు.



ఆధార్ కేంద్రం వద్ద సూచనలు ఇస్తున్న కమిషనర్ వెంకట్‌దాస్

సచివాలయాల్లో ఉచితంగా ఆధార్ అప్‌డేట్

వెల్దుర్తి: మండలంలోని వివిధ సచివాలయాల్లో మంగళవారం నుంచి ఈ నెల 27 వరకు నూతన ఆధార్ కార్డుల నమోదు, ఆధార్ అప్‌డేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నరసింహ తెలిపారు. నూతనంగా ప్రవేశపెట్టిన ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇప్పటి వరకు ఆధార్ కార్డు లేనివారికి నూతనంగా ఆధార్ కార్డులు ఉచితంగా సచివాలయాల ద్వారా మంజూరు చేస్తున్నారన్నారు. 24వ తేదీన ఉప్పలపాడు, 25న పట్లవీడు, 26న శ్రీరాంపురంతండా సచివాలయాల్లో ఆధార్ నమోదు జరుగుతుందన్నారు. ఆధార్‌కార్డు లేని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బోదిలవీడు సచివాలయంలో జరిగిన ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎంపీడీవో నరసింహ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆధార్ సేవలు

కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల, గాదెవారిపల్లె గ్రామాల్లో మంగళవారం ఆధార్ సేవలు కొనసాగాయి. నూతన ఆధార్ కార్డుల కోసం, అలాగే మార్పులు, చేర్పులు అవసరమైన వారు మొత్తం 72 మంది సాయంత్రం వరకు ఆధార్ సెంటర్లకు వచ్చారని తెలుస్తోంది. మొదటి రోజు 90 మందికి సేవలు అందించే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే ఒప్పిచర్ల ఆధార్ సెంటర్‌కు నరమాలపాడు గ్రామం నుంచి కూడా వచ్చారు. అలాగే గాదెవారిపల్లె ఆధార్ సెంటర్‌కు బట్టువారిపల్లె, కాచవరం, పెద కొదమగుండ్ల, చినకొదమగుండ్ల గ్రామస్తులు కూడా వచ్చారు. ప్రస్తుతం ఇద్దరు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారు అన్ని గ్రామాల్లో సేవలు అందించే విధంగా ఏర్పాటు జరిగిందని, ఐదు రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో ఆధార్ సెంటర్లు నిర్వహిస్తారని అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీవో జి.శ్రీనివాసరెడ్డి తెలిపారు.



బోదిలవీడు సచివాలయంలో ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేస్తున్న దృశ్యం

మండలంలో ఆధార్ ప్రత్యేక క్యాంపులు

దుర్గి: మండలంలోని వివిధ సచివాలయాల్లో మంగళవారం నుంచి ఈ నెల 27 వరకు నూతన ఆధార్ కార్డుల నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వీఎల్ఎస్ గుప్తా తెలిపారు. నూతనంగా ప్రవేశపెట్టిన ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. అర్హులై ఉండి ఇప్పటి వరకు ఆధార్ కార్డు లేనివారికి నూతనంగా ఆధార్‌కార్డులు సచివాలయాల ద్వారా మంజూరు చేస్తున్నారన్నారు. 24వ తేదీన ఆత్మకూరు, 25, 26న పోలేపల్లి, 27న దుర్గి–2 సచివాలయాల్లో ఆధార్ నమోదు జరుగుతుందన్నారు. ఆధార్‌కార్డు లేని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆధార్‌లో మార్పుల కొరకు సంబంధిత ధ్రువపత్రాలు ఆయా సచివాలయాలకు రావాలన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టిన పురపాలక శాఖ

సాక్షి కథనంపై స్పందించిన అధికారులు

సాక్షి స్పందన

మాచర్ల రూరల్: పట్టణంలో పారిశుద్ధ్యం లోపిస్తుంది. ఖాళీ స్థలాలే వ్యర్థాలకు, అంటు రోగాలకు నిలయాలుగా మారుతున్నాయని 'సాక్షి' దినపత్రికలో ఈ నెల 18న 'అసలే వర్షాకాలం .. పారిశుద్ధ్య చర్యలు శూన్యం' శీర్షికన వెలువడిన కథనంపై పురపాలక శాఖాధికారులు స్పందించారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాస్ నేతృత్వంలో 14వ వార్డులోని బీఎస్ఎన్ఎల్ టవర్ ప్రాంతంలోని ఖాళీ స్థలంలో చెట్లను తొలగించి పారిశుద్ధ్య పనులు చేపట్టారు. బీఎస్ఎన్ఎల్ టెలికాం ఎస్‌డీఏ రాజేందర్ తన సిబ్బందితో టవర్ ప్రాంతంలోని చెట్లను తొలగించి, పరిసరాలను శుభ్రం చేయించారు. అలాగే పట్టణంలోని నివాస గృహాల మధ్య ఉన్న చెట్లను, రోడ్లపై సంచరిస్తున్న ఆవుల పైన ప్రత్యేక దృష్టి సారించామని కమిషనర్ చెప్పారు. ఆవుల యజమానులకు నోటీసులు పంపి నిర్ణీత సమయంలో పశువుల యజమానులు స్పందించకపోతే సమీపంలోని గో శాలకు తరలిస్తామన్నారు. వీధుల్లో ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులను చేపడుతున్నామని, అంటు వ్యాధులు రాకుండా ఏఈ గౌతమి పర్యవేక్షణలో శానిటేషన్ పనులు చేపడుతున్నట్లు చెప్పారు.



ఖాళీ స్థలంలో చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

సీజనల్ వ్యాధులపై అవగాహన

కారెంపూడి: డయేరియా, జ్వరాల లాంటి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేతులను పరిశుభ్రంగా ఉంచుకుంటూ, పరిశుభ్రమైన నీరు, ఆహారాన్ని తీసుకోవాలని నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తినవద్దని ఈవోపీఆర్డీ పి.సత్య ప్రసాద్, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ప్రజలకు సూచించారు. మండలంలోని వేపకంపల్లి, గాదెవారిపల్లె, చినకొదమగుండ్ల గ్రామాలలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం గ్రామ సభలు నిర్వహించి అవగాహన కల్పించారు. ముందుగా ఆ గ్రామాలలో ఈవోపీఆర్డీ, సంబంధిత శాఖల ఉద్యోగులు పర్యటించి పారిశుద్ధ్య, డ్రైనేజి సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలని స్థానిక పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. స్వచ్ఛభారత్, జలజీవన్ మిషన్ శాఖలు సంయుక్తంగా గ్రామ సభలను నిర్వహించాయి. స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ కూరాకుల సుబ్బారావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు రాజు, కరుణాకర్, గ్రామ కార్యదర్శులు రామరాజు, రాజేష్‌బాబు, చెన్నకేశవరెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.



గాదెవారిపల్లెలో వాటర్ ట్యాంక్ పరిసరాలను పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ సత్యప్రసాద్

డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయండి



సమావేశానికి హాజరైన ఆర్‌పీలు



సమావేశంలో మేనేజర్ సుబ్బారావు తదితరులు

మాచర్ల: పట్టణంలోని ప్రతి డ్వాక్రా సంఘాన్ని మరింత బలోపేతం చేసేలా ఆర్‌పీలు కృషి చేయాలని స్థానిక మెప్మా ప్రాజెక్టు మేనేజర్ ఎం.సుబ్బారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని మెప్మా కార్యాలయంలో ఆర్‌పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని తిరిగి కట్టని వారిని చైతన్య పరచి బ్యాంకులకు చెల్లించేలా చూడాలన్నారు. ఎక్కడా అవకతవకలు లేకుండా ఆర్‌పీలు సంఘాలపై దృష్టి సారించి ప్రతి గ్రూపు రికార్డు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం మహిళల కోసం చేపట్టే సంక్షేమ పథకాలు ఆయా సంఘాల సభ్యులకు వివరించాలన్నారు. ప్రభుత్వ పథకాలు ఏ విధంగా పొందాలో డ్వాక్రా సభ్యులకు తెలపాలన్నారు. ఈ సమావేశంలో మెప్మా ప్రాజెక్టు సీఈవోలు రాజశేఖర్, అంజలి, 31 వార్డుల ఆర్‌పీలు ఉన్నారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

సీఐ శ్రీరాం వెంకట్రావు

పిడుగురాళ్ల: గంజాయి, మత్తు పానీయాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు తెలిపారు. గంజాయి, మత్తు పదార్థాలకు బానిసైన పిడుగురాళ్ల పట్టణానికి చెందిన బత్తుల శేఖర్ అనే వ్యక్తి ఏజెన్సీ ప్రాంతాల నుంచి కేజీ గంజాయి రూ.3 వేలకు కొనుగోలు చేసి తీసుకొని వచ్చి పిడుగురాళ్ల పరిసర ప్రాంతాలకు చెందిన చంద్రాతో కలసి చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి రూ.200కు అమ్ముతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో సమచారం మేరకు సోమవారం మురికిపూడి ప్రదీప్ చంద్రాను అదుపులోకి తీసుకొని విచారించగా.. అతడు ఇచ్చిన సమాచారం మేరకు పట్టణ జానపాడు రోడ్డులోని రైల్వే గేటు సమీపంలో ఖాళీ స్థలం వద్ద 1,080 గ్రాముల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మత్తుకు యువత బానిసలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున ఇటువంటి అసాంఘిక వ్యక్తుల పట్ల కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని సీఐ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు. పిడుగురాళ్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయిని పూర్తిగా కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు.

ఏపీకి నిధులు కేటాయింపు సంతోషకరం

నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ గుమ్మడి నాసరయ్య



మాచర్ల: వికసిత్ భారత్ లక్ష్యంగా, అద్భుతంగా ప్రధాన మంత్రి మోదీ ఆధ్వర్యంలో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని రకాలుగా ఎంతో మేలు చేసేలా ఉందని మాచర్ల నియోజకవర్గ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గుమ్మడి నాసరయ్య అన్నారు. మంగళవారం ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలు, యువత, మహిళలు, రైతుల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని రూపొందించిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌డీఏ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో కలిసి డబుల్ ఇంజన్ సర్కార్‌గా ఏపీ అభివృద్ధికి బాటలు వేస్తుందన్నారు. రాజధాని అమరావతికి, పోలవరం నిర్మాణానికి నిధులు కేటాయించటం సంతోషకరమన్నారు. విభజన హామీలు పూర్తి చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక, పారిశ్రామిక కారిడార్ నిర్మాణానికి, ఏపీని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు బీజేపీ కంకణం కట్టుకుందన్నారు. ప్రజలు ఎన్‌డీఏ కూటమిని ఆదరించినందుకు ఏపీ అభివృద్ధి చెందనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

దోమల నివారణకు చర్యలు



మాచర్ల: డెంగీ నియంత్రణతో పాటు దోమల నివారణకు మలేరియా మాసోత్సవాలలో భాగంగా సూపర్‌వైజర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పట్టణంలోని వార్డులలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం 5వ వార్డు, సుద్దగుంతల, పాత రైలు కట్ట ప్రాంతాలలో నీరు నిల్వ ఉన్న చోట ఎంఎల్ ఆయిల్ పిచికారీ చేయించారు. ఇది నీటిలోని లార్వాలను నశింపజేసి వాటిని అరికడుతుందని సూపర్‌వైజర్ నాగేశ్వరరావు తెలిపారు. అవగాహన కార్యక్రమంలో పట్టణానికి చెందిన సచివాలయ ఏఎన్ఎం డొక్కా కుమారి, మున్సిపల్ వర్కర్ అన్నమయ్య, మలేరియా సిబ్బంది తదితరులున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



విజయపురిసౌత్: విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందిన ఘటన మాచర్ల మండలం పశువేముల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దోసపాటి శ్రీహరి (65) భార్య కాంతమ్మతో కలిసి తనకున్న 5 ఎకరాల పొలంలో పనులు చేసేందుకు వెళ్లారు. భార్య పొలంలో కలుపు తీస్తుండగా శ్రీహరి పుల్లలు ఏరుతున్నాడు. అదే సమయంలో తన పొలం మీదుగా వెళ్లే 11 కేవీ విద్యుత్ లైన్ వైర్ ఇన్సులేటర్ దగ్గర తెగి శ్రీహరి మీద పడగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్ల ముందే భర్త చనిపోవటంతో కాంతమ్మ రోదిస్తున్న తీరు గ్రామస్తులను కలచివేసింది. వారికి నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విజయపురిసౌత్ ఎస్ఐ పట్టాభిరామయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి




రెంటచింతల: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం పొంచి ఉందని ప్రతి విద్యార్థిని ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఏఎన్ఎం షేక్ రంజాన్‌బి అన్నారు. మంగళవారం మండలంలోని మిట్టగుడిపాడు గ్రామ సమీపంలోని కస్తూర్బా పాఠశాలలో ఆమె విద్యార్థినులతో మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాల నుంచి కాపాడుకోవచ్చన్నారు. దోమ కాటు ద్వారా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధుల వ్యాపించే అవకాశం ఉందని వివరించారు. వరుసగా రెండు రోజుల పాటు జ్వరం వచ్చిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. పాఠశాల, హాస్టల్ పరిసరాలలో చెత్తను తొలగించాలని, మురుగు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది మహేష్‌బాబు తదితరులున్నారు.

28న ఉచిత వైద్య శిబిరం

కారెంపూడి: స్థానిక ఆర్యవైశ్య వీధిలోని షిర్డీ సాయి, సత్యసాయి సేవా సదన్‌లో ఆదివారం నరాలకు సంబంధించిన వ్యాధులకు ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని కారెంపూడి సత్య సాయి భజన మండలి ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏషియన్ వాస్క్యులర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో 28వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని నరాలకు సంబంధించి ఏ విధమైన జబ్బులున్నా నరాల స్పెషలిస్ట్ డాక్టర్లచే వైద్య సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకాల కింద అవసరమైన వారికి ఉచిత ఆపరేషన్లు కూడా చేయడం జరుగుతుందని తెలిపారు.

జల్‌జీవన్ నిర్వహణపై సమావేశాలు



దుర్గి: స్వచ్ఛభారత్, జల్‌జీవన్ మిషన్ నిర్వహణపై మండలంలోని పలు గ్రామాలలో సమావేశాలు నిర్వహించారు. మంగళవారం అడిగొప్పల, ధర్మవరం, ఆత్మకూరు గ్రామ పంచాయతీలలో సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్డీ శివప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి పైపులైన్ ద్వారా కుళాయిలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ హఫీజ్‌దీన్, కో ఆర్డినేటర్ బెంజిమెన్, సర్పంచ్‌లు నలబోతు చిన్నబ్బాయి, జూనియర్ అసిస్టెంట్ మనోజ్‌కుమార్, దుర్గారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.